
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 8 నవంబరు 2024
5

డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఏడుగురు హిందీ పండిట్లను ఉద్యోగాల నుంచి తొలగించడం కలకలం రేపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ఎంతో జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏడుగురి జీవితాలతో ఆడుకోవడం విస్మయం కలిగిస్తోంది. ఈ తొలగింపు ఉదంతం.. జిల్లా విద్యాశాఖ పరువును బజారున పడేసింది. నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లను పరిశీలించి, అర్హులను ఉద్యోగాలకు ఎంపిక చేయాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలుస్తోంది. ఎన్నో ఏళ్ల తమ కష్టం ఫలించిందని, తమకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయనే ఆనందంతో గత 20 రోజులుగా పాఠశాలలకు వెళ్తున్న వారు.. ఇప్పుడు రోడ్డున పడాల్సిన పరిస్థితి తలెత్తింది. విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సమన్వయ లోపానికి ఈ సంఘటన నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

జీవితాలతో ఆటలు

నాడు అర్హులు.. నేడు అనర్హులు..



ఉద్యోగాలు కోల్పోయిన వారు..

- ఏడుగురు హిందీ పండిట్లను తొలగించిన డీఈవో
- ఉదయం పాఠశాలకు వెళ్లగానే ఆర్డర్లు చేతిలో పెట్టిన హెచ్‌ఎంలు
- చెల్లని సర్టిఫికెట్లు దాఖలు చేయడమే కారణమని వెల్లడి
- వెరిఫికేషన్ సమయంలో అనుమతించి, ఇప్పుడు తిరస్కరించడంపై బాధితుల విస్మయం
- తొలగించిన వారి స్థానంలో కొత్తవారి నియామకం, పోస్టింగ్‌లు
- రాత్రికి రాత్రే గప్‌చుప్‌గా జారీ అయిన ఉత్తర్వులు
- 20 రోజులకే ముగిసిన సర్కారు కొలువు మురిపెం
- జిల్లా ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో మొత్తం 10 హిందీ ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత మెరిట్ ఆధారంగా 1:3 ప్రకారం అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. ఈ క్రమంలోనే హిందీ పండిట్ అభ్యర్థులు కూడా హాజయ్యారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం అర్హులైన 9 మందిని ఎంపిక చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వివిధ పాఠశాలల్లో నియమిస్తూ విద్యాశాఖ అధికారి ఆర్డర్ పత్రాలు అందించారు. దాంతో గత 20 రోజులుగా వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఏడుగురు దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు) నుంచి హిందీలో డిగ్రీ పూర్తిచేశారు. అవే సర్టిఫికెట్ల ఆధారంగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. వెరిఫికేషన్ సమయంలోనూ అవే దాఖలు చేశారు. అప్పుడు పరిశీలనలో పాల్గొన్న అధికారులు వాటిని ఆమోదించారు. కానీ 20 రోజుల అనంతరం ఆ సర్టిఫికెట్లు చెల్లవనే కారణంతో ఏడుగురి ఉద్యోగాలను ఊడబీకారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక ఉత్తర్వులు జారీచేశారు. ఈ పత్రాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన సదరు హిందీ ఉపాధ్యాయులకు అందించారు.

తొలగింపునకు గురైన వారు వీరే..

మయూరి నాగేశ్వరరావు (మధిర సీపీఎ పాఠశాల)
సట్టు రామలింగయ్య (బనిగండ్లపాడు, ఎర్రుపాలెం మండలం)
షేక్ నాగుల్ మీరా (కందూరు జడ్పీహెచ్ఎస్, వేంసూరు మండలం)
దోర్నాల లావణ్య (చిలుకూరు జడ్పీహెచ్ఎస్, మధిర మండలం)
తాటికొండ నాగలక్ష్మి (పాలేరు జడ్పీహెచ్ఎస్, కూసుమంచి మండలం)
తాటికొండ శ్రీదేవి (రేమిడిచర్ల జడ్పీహెచ్ఎస్, ఎర్రుపాలెం మండలం)
మొండేటి వెంకటరత్నం (తుమ్మలపల్లి జడ్పీహెచ్ఎస్, కొణిజర్ల మండలం)

దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాస్ నుంచి పొందిన డిగ్రీ సర్టిఫికెట్లు చెల్లవని అందుకే వారిని తొలగించినట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఏ సంవత్సరం నుంచి పొందిన సర్టిఫికెట్లను అనుమతించడం లేదో తెలుపడం లేదు. డీఎస్సీ పరీక్షలకు అనుమతించి, సర్టిఫికెట్ల పరిశీలనలో తమ సర్టిఫికెట్లను ఆమోదించి, ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత ఇప్పుడు అవి చెల్లవని చెప్పడంతో బాధితులు హతాశులవుతున్నారు. వెరిఫికేషన్ సమయంలో క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు సర్టిఫికెట్లను ముగ్గురు అధికారులు పరిశీలించి, అర్హులని ధ్రువీకరణ చేశారని, ఇప్పుడు అవే సర్టిఫికెట్లు సరైనవి కావని ఎలా అంటారని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆనందం తీరకముందే తమను రోడ్డుపాలు చేశారని పలువురు ఉపాధ్యాయులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇదిలావుండగా, ఏడుగురు ఉపాధ్యాయులను తొలగిస్తూ డీఈవో బుధవారం రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేయడం విస్మయం కలిగిస్తోంది. పైగా తొలగించిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తగా ఏడుగురిని నియమించి వారికి పోస్టింగ్‌లు సైతం ఇచ్చారు. అయితే వీరి ధ్రువపత్రాలను ఎప్పుడు పరిశీలించారో, కౌన్సిలింగ్ ఎక్కడ నిర్వహించారో తెలియలేదు. పాతవారి తొలగింపు, కొత్తవారి నియామకం అంతా రహస్యంగానే జరగడం గమనార్హం.

పరిశీలించింది ఎవరు..?

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను నగరంలోని నయాబజార్ (మిగతా 6వ పేజీలో)



వారి సర్టిఫికెట్లు చెల్లవు

సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం

డీఎస్సీ-24 ద్వారా హిందీ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఏడుగురి సర్టిఫికెట్లు నిబంధనల ప్రకారం లేవు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో విద్యాశాఖ అధికారుల నుంచి తప్పిదం జరిగింది. అభ్యర్థులు సమర్పించిన డిగ్రీకి సంబంధించిన సర్టిఫికెట్లపై అనుమానాలు ఉండటంతో వాటిని తిరిగి పరిశీలించాం. ఇప్పుడవి చెల్లవని తేలడంతో ఏడుగురని ఉద్యోగాల నుంచి తొలిగించాం. వారి స్థానంలో కొత్తగా సర్టిఫికెట్ల పరిశీలన చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి అర్హులకు పోస్టింగ్‌లు ఇచ్చాం.



బోనకల్‌లో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

విద్యా వ్యవస్థ మెరుగుకు కృషి

- అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- శ్రేణుల ఘనస్వాగతం

6



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పత్తి కొనుగోళ్లలో కొర్రీలు వద్దు

- తేమ శాతం నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలి
- సీపీఎం, రాష్ట్ర రైతు సంఘం నాయకులు
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద ధర్నా
- రైతులతో మాటామంతీ

6

జోరుగా ఇంటింటి సర్వే ప్రక్రియ

- రెండో రోజు 4,13,961 ఇళ్ల సందర్శన
- ఇప్పటివరకు 77.18 శాతం ఇళ్ల గుర్తింపు
- ప్రతీ ఇంటి ప్రవేశం వద్ద స్టిక్కరింగ్
- నేటి నుంచి ప్రశ్నావళి ప్రకారం సమాచారం సేకరణ



సర్వేను పరిశీలిస్తున్న శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రాథమిక సమాచారం సేకరణ దాదాపు పూర్తయ్యింది. ఈ ప్రక్రియ ప్రారంభంలో కొంత తడబడినా రెండోరోజైన గురువారం కుదుటపడింది. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ ఎప్పటికప్పుడు ఆదేశాలు, సమీక్షలతో సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. దీంతో వేగంగా ప్రక్రియ కొనసాగుతోంది. సర్వేలో భాగంగా నేరుగా వివరాల సేకరణ కాకుండా.. ముందుగా ఇళ్ల సమాచారం సేకరించేలా ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే.

ఇళ్ల సమాచారం సేకరణ

జిల్లాలో 589 గ్రామ పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల పరిధిలో బుధవారం ఇళ్ల సేకరణ క్రతువు మొదలైంది. అధికారుల వద్ద ఉన్న ప్రకారం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 3,33,394 ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 2,02,941ఇళ్లు, మొత్తంగా 5,36,335 ఇళ్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంలో వీటిని నిర్ధారించేందుకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. 3,719 మంది ఎన్యుమరేటర్లను రంగంలోకి దించారు. వీరంతా ఎన్యుమరేటర్ 3,654 బ్లాకులకుగాను తొలిరోజు 3,035 బ్లాకుల్లో, రెండోరోజున 188 బ్లాకుల్లో తిరిగి వివరాలు రాసుకున్నారు. తొలిరోజున 3,31,012 ఇళ్లను సర్వే చేయగా రెండోరోజు గురువారం 38,665 ఇళ్లను పూర్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో తొలిరోజు 54,284 ఇళ్లను లెక్కింపు చేపట్టగా రెండో రోజున 9,423 ఇళ్లను పూర్తి చేశారు. రెండో రోజు దాదాపు జిల్లాలో 77.18 శాతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. ఇంకా జిల్లాలో లక్ష 22,374 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంది.

ఎన్యుమరేటర్లు ఏం చేస్తున్నారంటే...?

- ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి యజమాని పేరు. ఇంటి నంబర్ రాసుకుంటున్నారు. ఇంటికి స్టిక్కరు అతికిస్తున్నారు. ఆయా కుటుంబ సభ్యులకు సర్వే కోసం 8 తర్వాత వస్తామని చెబుతున్నారు.
- గత మూడు రోజులపాటు ఇళ్ల వివరాలు సేకరిస్తున్నారు. 8వ తేదీ నుంచి సర్వే మొదలు పెట్టనున్నారు. గురువారం నాటికి ఇళ్ల సంఖ్యపై స్పష్టత వచ్చింది.
- ప్రజలను అడగాల్సిన ప్రశ్నలతో కూడిన పత్రాలపైనే యజమాని పేరు, ఇంటి నంబర్ రాసుకుంటున్నారు.
- నాలుగు కుటుంబాలుంటే.. నాలుగు ఇళ్లుగా పరిగణిస్తున్నారు. శుక్రవారం వరకు ఇదే తరహాలో సర్వే కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రజలు వీటిని సిద్ధం చేసుకోండి...!

- ఇంటికి సర్వేకు అధికారులు వచ్చినప్పుడు కుటుంబసభ్యులు ఆధార్, రేషన్‌కార్డు, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు దగ్గర ఉంచుకోవాలి.
- సర్వేలో 56 ప్రశ్నలుంటాయి. వీటిలో 50 ప్రశ్నలు నార్మల్‌గా ఉంటాయి. వీటికి సంబంధించి సమాధానం చెప్పాలి. మిగిలిన 6ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు అనుబంధంగా 3-5 ప్రశ్నలుంటాయి. కుల, మత వివరాలు అడిగినప్పుడు ఇష్టమైతేనే చెప్పాలి. తప్పనిసరి కాదు. చిరునామా విషయంలో 6 నెలలకు పైగా నివాసంలో ఉంటున్నట్టు ఆధారం చూపించాలి.



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.1.03కోట్లు

భద్రాచలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో దేవస్థానానికి రూ.1,03,21,415 ఆదాయం సమకూరింది. రామాలయంలోని చిత్రకూట మండపంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ హుండీలను తెరిచి సిబ్బంది లెక్కింపు నిర్వహించారు. మొత్తం రూ.1,03,21,415 నగదు, 90 గ్రాముల బంగారం, 900 గ్రాములు వెండి లభించింది. అలాగే 140 యుఎస్ డాలర్లు, 10 పౌండ్స్, రెండు దినార్‌లు, 20 నేపాల్ రూపీస్, 10,000 ఇండోనేషియా రూపిన్‌లు లభించినట్లు ఈవో రమాదేవి తెలిపారు. లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు భవానీ రామకృష్ణారావు, కత్తి శ్రీనివాసరావు, ఈఈ వి.రవీంద్రనాథ్, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

భద్రాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి వారధి వద్ద చెక్‌పోస్టును ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల ఒడిశా, ఏపీ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి గంజాయి, పశువుల అక్రమ రవాణా సాగుతున్న నేపథ్యంలో ఇక్కడ పోలీసు శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

భద్రాచలంలో హాస్టల్ కార్మికుల ఆకలికేక దీక్షలు

- 17 నెలలుగా అందని వేతన బకాయిలు
- ప్రారంభించిన సీఐటీయూ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

భద్రాచలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ గురువారం ఐటీడీఏ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆకలికేక దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, కోశాధికారి జి. పద్మ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాస్తవానికి 22 నెలల వేతన బకాయిలు రావాల్సి ఉండగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ తన బడ్జెట్ ద్వారా రెండు విడతలుగా ఆరు నెలల వేతనాలు చెల్లించారని, మిగిలిన 17నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అనేకసార్లు అధికారులకు విన్నవించినా వేతనాలు రావడం లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో రిలే నిరాహారదీక్షకు దిగామన్నారు. 15వ తేదీలోపు వేతనాలు రాకపోతే నిరవధిక సమ్మె చేస్తామన్నారు. జిల్లాలో నలుగురు గిరిజన ఎమ్మెల్యేలున్నారని, గిరిజన కార్మికుల ఆకలి బాధలపై వారు స్పందించి ముఖ్యమంత్రితో మాట్లాడాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న చెక్‌ను పాస్ చేయించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, యన్.నాగరాజు, జలందర్, రాము, శ్యామల, జయ, సుభద్ర, రాజ్యలక్ష్మి, స్వరూప, ఉదయలక్ష్మి, మున్నా, కృష్ణ, రాజేష్, జ్యోతి పాల్గొన్నారు.



సాధిక్ అలీ

ఘొల్లుమన్న కల్లూరు

- 'తోపుడు బండి' సాధిక్ ఆకస్మిక మరణంతో విషాదం
- సామాజిక సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర
- పేద పిల్లల విద్యకు అనేక ఏళ్లుగా అండ
- పలువురు ప్రముఖుల సంతాపం
- తాతయ్యకు విద్యార్థుల నివాళి
- స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు

6

రైస్..రైట్..

ధాన్యం సీజన్ ప్రారంభం కావడంతో జిల్లా యంత్రాంగం మిల్లులకు సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) ధాన్యం కేటాయించడం ప్రారంభించింది. మొదట్లో బ్యాంకు గ్యారంటీలుంటేనే ధాన్యం ఇస్తామని షరతులు పెట్టగా, మిల్లర్లు ససేమిరా అనడంతో వివాదం తలెత్తింది. దీంతో జిల్లా కలెక్టర్ పలుమార్లు మిల్లర్లతో సమావేశం కావడంతో లిఖితపూర్వక అంగీకార పత్రాలు ఇచ్చి ఆ తర్వాత గ్యారంటీ పత్రాలు ఇస్తామని మిల్లర్లు ముందుకువచ్చారు. దీంతో సీఎంఆర్ బకాయిలులేని మిల్లర్లకు ధాన్యం కేటాయించాలని నిర్ణయించి 15 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేశారు.



సీఎంఆర్ కేటాయింపులు ప్రారంభం

- గ్యారంటీలు లేకుండానే మిల్లర్లకు ధాన్యం
- బకాయిలున్న మిల్లులకు కేటాయింపులు నిల్
- మొదటి విడతలో 15 మిల్లులకు గ్రీన్ సిగ్నల్
- 2022-23, 2023-24 సంవత్సరాల్లో నెరవేరని సీఎంఆర్ లక్ష్యాలు

ఖమ్మం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 66కు పైగా మిల్లులుండగా 20మిల్లులు సీఎంఆర్ ధాన్యం అందించాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా 40కిపైగా మిల్లులున్నాయి. ఈ జిల్లాలో 10మిల్లులు మాత్రమే సీఎంఆర్ బియ్యం బకాయిలున్నాయి. బకాయిలున్న మిల్లులందరికీ ఇప్పటికే పౌరసరఫరాలశాఖ నోటీసులు జారీచేసింది. కొత్త ధాన్యం వస్తున్నందున కేటాయింపుల నేపథ్యంలో పాత బకాయిల లెక్కల వివరాలను ఇప్పటికే పూర్తిస్థాయిలో సేకరించారు. కొన్ని మిల్లులు కోట్లాది రూపాయల విలువైన ధాన్యాన్ని దారిమళ్లించిన విషయం విదితమే.

ఖమ్మం జిల్లా పరిధిలో పలు మిల్లులు ఖరీఫ్, రబీ ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ బియ్యం అందించాల్సి ఉంది. 2022-23లో 72,848 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా కేవలం 29,853 మెట్రిక్ టన్నుల బియ్యం అందించారు. 42,944 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్ద ఉన్నట్టు చూపించినా చాలావరకు ఉన్న ధాన్యం నాణ్యత దెబ్బతినడం, కొన్ని రైస్‌మిల్లుల్లో అసలు ధాన్యం లేని విషయం అధికారులు గుర్తించారు. అలాగే 2023-24కు సంబంధించి ఖరీఫ్ కింద 1,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు కేటాయించగా.. 80 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాలి. ఇప్పటివరకు 60వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అందించారు. ఇంకా 20వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందించాలి.

అలాగే రబీ సీజన్‌కు సంబంధించి 21వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు కేటాయించగా 14 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి అందించాలి. ఇప్పటివరకు 4వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందించారు. ఇంకా 10వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి వెళ్లాల్సి ఉంది. ఖరీఫ్, రబీ కలిపి 30వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి చేరవేయాల్సి ఉంది. ధాన్యం ఆడించి బియ్యం అందించాల్సిన గడువు ముగిసినా మిల్లర్లనుంచి బియ్యం చేరని పరిస్థితి. బకాయిలున్న సుమారు 20పైగా మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయించడం లేదు.

బకాయిలులేని మిల్లులకు మాత్రమే ప్రస్తుత ఖరీఫ్ ధాన్యాన్ని సీఎంఆర్ బియ్యంగా మార్చి ఇచ్చేందుకు ఇస్తున్నారు. అయితే కొంత మంది మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడంలేదు. సన్నబియ్యం క్వింటాకు 67 కేజీలు (మిగతా 6వ పేజీలో)

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



తల్లాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

● ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం తల్లాడ మండలంలోని తల్లాడ, అంజనాపురం, రామానుజావరం, పినసాక గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. తల్లాడలో సెంటర్ లైటింగ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్లు రెడ్డం వీరమోహనరెడ్డి, తూము వీరభద్రరావు, వైస్ ఛైర్మన్ కటికి నర్సింహారావు, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ వనజ, ఏవో ఎండీ. తాజుద్దీన్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కల్లూరులో టీడీపీ సభ్యత్వ నమోదు

కల్లూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆపార్టీ అడహక్ కమిటీ జిల్లా నాయకులు కనగాల సాంబశివరావు, కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనువాసరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు గత నెల 26 వ తేదీన మంగళగిరిలో సభ్యత్వ నమోదును ప్రారంభించడం జరిగిందన్నారు. పార్టీ సభత్వ నమోదు కాలపరిమితి రెండు సంత్సరాలుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోట్రు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, రాజేశ్వరరావు, గోసు కృష్ణారావు, యువ నాయుకుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

'సర్వేకు అదనపు ఎన్యుమరేటర్లను కేటాయిస్తాం'



మాట్లాడుతున్న తహసీల్దార్ చందర్

బోనకల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేకు అదనపు ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తహసీల్దార్ ఎ. పున్నమ్ చందర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమగ్ర ఇంటింటి సర్వే పై సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు 150 నుంచి 175 కుటుంబాలకు ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు సర్వే బాధ్యతలను అప్పగించామని తెలిపారు. కాని గత మూడు రోజులుగా కొనసాగుతున్న కుటుంబాల గుర్తింపు ప్రక్రియలో అదనంగా కుటుంబాలు వచ్చిన బ్లాకులకు ఎన్యుమరేటర్లను కేటాయించే విధం గా ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపామని పేర్కొన్నారు. వారి ఆదేశాల మేరకు అదనపు ఎన్యుమరేటర్లను విధుల్లోకి తీసుకొని సర్వేను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను ముంచిన కాల్వ గండ్లు

- ఇటీవల భారీవరదలతో కాల్వలకు గండ్లు
- సాగర్ నీటి విడుదలతో మునిగిన వరి పొలాలు
- చేతికొచ్చిన పంట చేజారిపోతుందని అన్నదాతల ఆవేదన



జమలాపురంలో కాల్వకు పడిన గండి

ఎర్రుపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వర్షాలను ఎదుర్కొని వరదలకు తట్టుకుని ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయంలో పొలాలకు ప్రాణం పోసే కాల్వ గండ్లు పంటల ప్రాణాలు తోడేస్తున్నాయి. ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామంలో సాగర్ కాల్వ ద్వారా సేద్యం చేస్తూ వరి పంటను పండించే రైతులు వందల సంఖ్యలో ఉన్నారు. నాగార్జున సాగర్ కాల్వ ప్రవాహం ఆంధ్రా నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఎర్రుపాలెం మండలంలోకి కూడా ఆంధ్రాలోని కాల్వల ద్వారా సాగరనీరు తెలంగాణ కాల్వల్లోకి కలుస్తుంది. ఆంధ్రాలో వర్షాలకు పెరిగిన వరదనీరు, సాగర్ కాల్వల ద్వారా తెలంగాణలోకి ప్రవేశించింది. కాగా ఇటీవల కురిసిన భారీవర్షాలకు మండలంలో ప్రవహించే మైలవరం బ్రాంచి కెనాల్‌కు గండ్లు పడ్డాయి. ప్రస్తుతం ఆగండ్ల ద్వారానే కాల్వల్లో నీరు పంట పొలాలను ముంచెత్తింది.



నీటమునిగిన పంట పొలాన్ని చూపిస్తున్న రైతు గద్దె నాగమల్లేశ్వరరావు

చెరువులను తలపిస్తున్న వరిపొలాలు

కృష్ణాజిల్లా నుంచి మండలంలోకి వస్తున్న మైలవరం బ్రాంచ్‌కెనాల్ దాదాపుగా 20కి.మీ. కృష్ణాజిల్లా మైలవరంలోనే ప్రయాణిస్తుంది. ఆతర్వాతే మండలంలోకి వస్తుంది. ఇటీవల వరదలకు మైలవరం కెనాల్ 36.706 కి.మీవద్ద అండర్ టన్నెల్ పూర్తిగా కుప్పకూలి కాలవకు పెద్ద గండి పడి వరద నీరు పొలాలను ముంచెత్తింది. కాలవల్లో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో తెగిపోయిన గండ్ల ద్వారా నీరు పంట పొలాల్లోకి చేరి, పొలాలను ముంచెత్తాయి. కాల్వల ద్వారా కిందికి పోవాల్సిన నీరు పొలాల మీదుగా రావడంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రభుత్వం చొరవచూపి నష్టాన్ని నివారించాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలోనే సాగర్ కాల్వ నిరాదరణకు గురై కాలవల్లో జంగిల్, పూడికతో కాల్వలు రూపురేఖలు మారిపోయాయి. మైలవరం బ్రాంచ్ కెనాల్‌పై ఉన్న అండర్ టన్నెల్‌లు పూర్తిగా దెబ్బతినడంతో గండ్లు పడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మూడు యూటీల పునర్నిర్మాణానికి రూ.2.80కోట్లతో అంచనాలతో ఉన్నతాధికారులు పంపించారు. వాటి నిధుల మంజూరుకు ఈఎన్సీ నుంచి అనుమతి రావాల్సి ఉంది. అనుమతుల ఆలస్యం అయితే పనులు ఇంకెంత ఆలస్యమవుతాయోనని రైతులు వాపోతున్నారు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): యువత అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీలో భాగంగా గురువారం కళాశాలలో బెంగుళూరుకు చెందిన స్పైడర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, సీఎస్‌ఆర్ కంపెనీలు బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 183మందికి గాను 28మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ డా.బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మన్ బండి అన్విద, ప్రిన్సిపాల్ ఊటుకూరు శేషారత్నకుమారి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.డీఎస్‌వీ.కృష్ణారెడ్డిలు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కిషోర్

మధిరటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. పన్నెండు మందికి రూ.6.30లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, దుంపా వెంకటేశ్వర రెడ్డి, అద్దంకి రవి, బాలరాజు, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ, వెంకయ్యబాబు పాల్గొన్నారు.

మహిళా టీచర్ల శ్రమదానం



గుంతలలో కంకర పోసి చదును చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

బోనకల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం పాఠశాలకు ఖమ్మం నుంచి రాకపోకలు సాగిస్తున్న వారికి ఈ మార్గం నరక యాతనగా మారింది. ఖమ్మం నుంచి బోనకల్ వరకు మార్గ మధ్యలో ఉన్న కొన్ని గుంతలకు తమ వంతుగా శ్రమదానం చేయాలన్న ఆలోచన చేశారు మహిళా ఉపాధ్యాయులు గంటేల ఝాన్సీ, ఏ.విజయలక్ష్మి, ఏ.నక్షత్రమణి, టి.నాగమణి. బోనకల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వీరు గురువారం కారులో కంకర, సిమెంటు మిశ్రమాన్ని తీసుకువచ్చి గుంతలను పూడ్చారు. విద్యా బోధనతో పాటు రోడ్డు పై పడిన గుంతలకు మరమ్మతులు చేసి ఔదార్యాన్ని చాటినందుకు గానూ మహిళా టీచర్లను పలువురు అభినందించారు.

సౌండ్‌సిస్టం అందజేత

కారేపల్లి, నవబంరు7:(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధారవత్ హేమలతలక్ష్మణ్ దంపతులు గ్రామంలోని అయ్యప్పస్వామి దీక్షదారులకు గురువారం సౌండ్‌సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా సౌండ్‌సిస్టం అందజేసిన దాతలకు పీఎస్‌ఆర్ యూత్ అధ్యక్షుడు జర్పల దోని నాయక్‌తో పాటు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 12న పూజ సామాగ్రి వేలం

ఏన్కూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన గార్లొడ్డు లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ పూజ సామాగ్రి వేలం పాట ఈనెల 12న మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లకు జరిగే వేలంలో ఆసక్తికలిగిన వారు డిపాజిట్ డీడీ తీసి పాల్గొనాలని కోరారు.

నాడు అర్హులు.. నేడు అనర్హులు

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలో విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో కొందరు హెచ్ఎంలు పరిశీలించినట్టు తెలుస్తోంది. దక్షిణ భారత హిందీ ప్రచార సభ జారీ చేసిన డిగ్రీ సర్టిఫికెట్లు చెల్లవనే విషయాన్ని వారు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదనేది అంతుబట్టడం లేదు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో సరైన మార్గదర్శకత్వం చేయలేదా..? మరేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. అప్పుడు అనుమతించి, ఇప్పుడు తిరస్కరించడం సరికాదని, ఇది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడటమేననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుండగా, హిందీ ప్రచార సభ జారీ చేస్తున్న డిగ్రీ సర్టిఫికెట్ల విషయంలో ప్రభుత్వం నుంచి సరైన నిబంధనలు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురుకులాల పోస్టులకు ఒక విధంగా, డీఎస్సీ పరీక్షలకు మరోవిధంగా నిర్ణయాలు ఉంటాన్నాయని చెబుతున్నారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలనలో తప్పిదాలకు పాల్పడిన హెచ్ఎంల వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిసింది. వారిపైన ఎలాంటి చర్యలుంటాయో తేలాల్సి ఉంది.

మా ఉద్యోగాలు మాకు ఇవ్వాలి...

- తాటికొండ నాగలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్ పాలేరు

జిల్లా విద్యాశాఖ అధికారి కొందరి మాటలు విని మా సర్టిఫికెట్లు చెల్లవని అర్ధరాత్రి ఉద్యోగంలోంచి తీసిఏశారు. మా ఉద్యోగాలు మాకు వచ్చేంత వరకు పోరాడుతాం. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి ఎలా ఆర్డర్లు ఇస్తారు..? మా పోస్టులో మా తరువాత ర్యాంక్ వారికి కాక ఇతర ర్యాంక్‌లు వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వటంపై అనుమానాలు ఉన్నాయి. సర్టిఫికెట్ల పరిశీలనలో లేని అనుమానాలు నేడు ఎలా వచ్చాయి. ఇదే సర్టిఫికెట్లతో ఎంతో మంది జిల్లాలో ఉద్యోగాల్లో ఉన్నారు.

అనుమానాలు ఉన్నాయి..

- తాటికొండ శ్రీదేవి, రేమిడచర్ల, ఎర్రుపాలెం మండలం

డీఎస్సీలో హిందీలో ఖమ్మం జిల్లాలో రెండో ర్యాంక్ సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హైదరాబాద్ సభలో నియామక పత్రాలు అందించారు. ఎర్రుపాలెం మండలం రేమిడచెర్ల ప్రభుత్వ పాఠశాలలో 20 రోజులుగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నా. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లగానే ప్రధానోపాధ్యాయులు పిలిచి తనను ఉద్యోగంలోంచి తీసివేసినట్లు డీఈవో ఆర్డర్‌ను అందించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా తీసివేసినట్లు చెప్పడంపై అనుమానాలు ఉన్నాయి.

అందరికీ ఒకే రూల్ ఉండదా?

- దోర్నాల లావణ్య, చిలుకూరు, మధిర మండలం

2016కు ముందు దక్షిణ భారత హిందీ ప్రచార సభ జారీచేసిన సర్టిఫికెట్లు చెల్లవని జిల్లా విద్యాశాఖ అధికారి నన్ను ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టు నుంచి తొలింగించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో కానీ, కౌన్సిలింగ్‌లో సమయంలో కానీ ఈ సర్టిఫికెట్లు చెల్లవని అభ్యంతరం చెప్పలేదు. కానీ నేడు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పాఠశాలకు వచ్చిన తరువాత ఉద్యోగంలోంచి తొలగించినట్లు ఆర్డర్ కాపీ అందించారు. జిల్లాలో పనిచేస్తున్న ఎంతోమంది హిందీ పండిట్‌లు ఈ డిగ్రీ పట్టాలతోనే ఉద్యోగంలో ఉన్నారు. వారికో రూల్, మాకో రూల్ ఉంటే ఎలా..?

తొలగింపు ఆర్డర్లు రద్దు చేయాలి...

- మయూరి నాగేశ్వరరావు, మధిర ప్రభుత్వ పాఠశాల

జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఆర్డర్లను వెంటనే రద్దు చేసి మమ్మల్ని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలి. లేని పక్షంలో ఉద్యోగాలు సాధించేంత వరకు ఉద్యమిస్తాం. తొలగించిన మా స్థానాల్లో ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్ల పరిశీలనపై సమగ్ర పరిశీలన జరిపించాలి.

'సీఎంఆర్' కేటాయింపులు షురూ

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాలని నిబంధన ఉండడంతో చాలాకాలం బియ్యం ఇచ్చే విషయంలో కొంత తగ్గించాలని మిల్లర్ల యజమానులు డిమాండ్ చేస్తూ వచ్చినా ప్రభుత్వం పైస్థాయిలో అందుకు అంగీకరించలేదు. దొడ్డుబియ్యం వలే క్వింటాకు 67కేజీలు సన్నబియ్యం ధాన్యానికి ఇవ్వాలని షరతులు విధించడంతో చివరకు మిల్లర్లు ఒప్పుకున్నారు. మరోవైపు పాతబకాయిలు సీఎంఆర్ బియ్యాన్ని లేదా సొమ్ములను కట్టించడం అలాగే కొత్తగా ఖరీఫ్‌లో ఇచ్చే ధాన్యం విషయంలో ఎప్పటికప్పుడు నిఘా విధించబోతున్నారు. ఖమ్మం జిల్లాలో 4.24 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యం పెట్టుకుని ఇప్పటికే 322 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయితే ప్రైవేటు మిల్లర్లు ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. తేమ ఉన్న ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాని పరిస్థితి. అయితే ప్రస్తుతం యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరమైతే మిల్లులకు కేటాయింపులు, సరఫరా అనంతరం బియ్యం సేకరణ విషయంలో కూడా నిరంతర పర్యవేక్షణ జరపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. మొత్తం మీద బ్యాంకు గ్యారంటీ లేకుండానే రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయి.

విద్యా వ్యవస్థ మెరుగుకు కృషి

» ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

చింతకాని, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో రూ. 8 కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణంతో వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందని, తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గం రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తయారుకానుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో నరసింహరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, బండెల నాగార్జున, తోటకూరి ప్రగతి, ఆవుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

బోనకల్ (ఆంధ్రజ్యోతి): బోనకల్ నుంచి రాయనపేట వరకు 9 కిలోమీటర్ల రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ. 15 కోట్ల నిధులతో చేపట్టే విస్తరణ పనులకు గురువారం రాత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గోవిందాపురం(ఎ) కాంగ్రెస్ నాయకులు బాగం నాగేశ్వరరావు, బాగం పాపారావు, ఎన్‌ఆర్‌ఐ బాగం రాకేష్‌లు భట్టిని గజమాలతో సత్కరించారు. పలు సమస్యల పై ప్రజలు వినతి పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ తానేశ్వర్, తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సొసైటీ ఛైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, బీపీ నాయక్, పొసంగులపాటి కోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, మరీదు శ్రీనివాసరావు, తమ్మారపు బ్రహ్మయ్య, కనగాల నాని, అంతోటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.40లక్షలు చెల్లించాలి

» ఏన్కూరు లింకుకెనాల్ భూనిర్వాసితుల డిమాండ్

ఏన్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఏన్కూరు లింకు కెనాల్ భూనిర్వాసితులు గురువారం స్థానిక రైతువేదిక వద్ద స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి ఎదుట ఆందోళన చేశారు. తక్షణమే ఎకరానికి రూ.40లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా వెళ్లి ఎస్‌ఐ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు బానోతు బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయకుండా అవార్డు ప్రకటించకుండా, రైతులకు కనీసం సమాచారం అందించకుండా పనులు చేపట్టారని పేర్కొన్నారు. సరిహద్దులు నిర్ణయించకుండా ఆరునెలల క్రితం హడావుడిగా కాలువ తవ్వి నయాపైసా చెల్లించలేదని వాపోయారు. 110మంది రైతులకు చెందిన 120 ఎకరాల భూమి రేపల్లెవాడ, ఏన్కూరు, భగవాన్‌నాయక్ తండా, అక్కినాపురం తండా, హిమాంనగర్ రైతులం ఎంతో విలువైన భూములు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్య వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఆర్‌ఐ నవీన్, భూనిర్వాసితులు బానోతు బాలాజీ, వెనిగళ్ల శ్రీహరి, మేడా ధర్మారావు, ఆది నర్సింహారావు పాల్గొన్నారు.

ఘొల్లుమన్న కల్లూరు



సాధిక్‌అలీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన 'తోపుడుబండి' ఫౌండేషన్ అధినేత సాధిక్ అలీ గుండెపోటుతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. 15సంవత్సరాల క్రితం సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టేందుకు ఆయన తోపుడుబండి ఫౌండేషన్‌ను స్థాపించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి అన్నివర్గాల వారి ఆదరణ పొందారు. తోపుడుబండిపై విజ్ఞానదాయకమైన పుస్తకాలను ఏర్పాటు చేసుకొని వాడవాడల తిరుగుతూ మొబైల్ లైబ్రరీగా సేవలందించారు.

తన స్వంత గ్రామమైన కల్లూరు పట్టణానికి ఐదేళ్ల క్రితం చేరుకొని కరోనా సమయంలో అనారోగ్యానికి గురైన వందల మందికి అన్నదానం, వైద్య సహాయం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాదిమంది పేద విద్యార్థులకు సైకిళ్లు, స్టడీ మెటీరియల్ సామగ్రి, బ్లైలు, షూలు అందించారు. ఇలా పలు ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణకు, ఉన్నత విద్యలో రాణించేలా ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు విద్యలో రాణించేలా అన్ని విధాలుగా చేయూత నిచ్చారు. సాధిక్‌అలీని తాతయ్య అని ముద్దుగా విద్యార్థులు పిలిచేవారు. కాగా సాధిక్‌అలీ సతీమణి ఉషాదయాళ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఉన్నత అధికారిగా పని చేస్తున్నారు.

ప్రముఖుల సంతాపం....

సాధిక్‌అలీ మృతిచెందిన సమాచారం తెలుసుకొని వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, సామాజిక వేత్తలు, రాజకీయ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున కల్లూరులోని ఆయన నివాస గృహానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా సాధిక్ అలీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజాచౌదరి, నాయకులు పసుమర్తి చందర్ రావు, బాగం ప్రభాకరచౌదరి, లక్కినేని రమేష్, కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ తరుపున బాబు బయ్యన, బండి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, సాధిక్‌అలీ అంత్యక్రియలు సాయంత్రం కల్లూరులో నిర్వహించారు.

పత్తి కొనుగోళ్లలో కొర్రీలు వద్దు

ఖమ్మం మార్కెట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తిని తేమ శాతం నిబంధనలు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులతో కలిసి నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాల కారణంగా పత్తి రైతులు భారీగా దిగుబడి కోల్పోయారని, తేమశాతం నిబంధనలతో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెట్టి రైతుల పంట కొనుగోలు చేయట్లేదని ఆయన విమర్శించారు. ఈ-నామ్, జెండా పాటలతో సంబంధం లేకుండా పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేవిధంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు సమయంలో నిర్ణయించిన ధరను కాంటాల సమయంలో తగ్గించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్‌లోనే రైతులకు చేరువగా సీసీఐ కేంద్రాలు ఉండాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని వారు కోరారు.

ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో తిరుగుతూ రైతులతో మాట్లాడి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్, నాయకులు వై.విక్రమ్, ఎర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, శీలం నర్సింహరావు, భూక్యా శ్రీనివాసరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె.మీరా తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా విద్యుత్ సేవలు

● ప్రమాద రహితమనే ఖ్యాతి పొందాలి

● ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ ప్రమాదంలో ఒక ప్రాణంపోతే ఆ వ్యక్తి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుంది..? అందువల్ల విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. తద్వారా సంస్థకు మంచిపేరు, నాణ్యత వస్తుంది.' అని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో ఆపరేషన్, మెయింటెనెన్స్ ఉద్యోగులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల పమ్మి, చింతకానిలో జరిగిన విద్యుత్ ప్రమాదాలు, మృతికి కారణాలపై సమీక్షించారు. మరోసారి ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్మాణంపై మూడు నెలల వరకు ఎందుకు జాప్యం జరుగుతుందని సంబంధిత ఇద్దరు అధికారులను సీఎండీ ప్రశ్నించారు. నిర్ణీత సమయంలోగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ మరమ్మతులకు జరుగుతున్నాయని, నాణ్యతగా మరమ్మతులు చేపట్టాలని, ఒకే ప్రాంతంలో తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటే అందుకు గల కారణాలను సాంకేతిక బృందాలు పరిశీలించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు రవాణా విషయంలో రైతుల ట్రాక్టర్లు వినియోగించవద్దని, విద్యుత్‌శాఖ వాహనాలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు విద్యుత్ మరమ్మతుల సమయంలో ఎల్సీ తీసుకొని ప్రమాదాలకు గురవుతున్నారని, ఒక ఎల్సీ తీసుకుంటే ఆ విషయం డివిజన్ స్థాయి అధికారి వరకు ఒకే సమయంలో తెలిసేలా సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు ఇబ్బంది కలిగేలా విద్యుత్ కోతల సమయం ఉండకూడదని ఆదేశించారు. విద్యుత్ ఉద్యోగులు అవినీతి రహితంగా పనిచేయాలని సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు. పొలంబాట కార్యక్రమం కొనసాగించి రైతుల విద్యుత్ సమస్యలకు ముందస్తుగా పరిష్కారం చూపాలని సూచించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్, అశోక్‌కుమార్, సదర్లు, సీఈ కిషన్, ఎస్ఈ సురేందర్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

అనారోగ్య కారణాలతో వృద్ధుడి బలవన్మరణం

సత్తుపల్లిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన అరవపల్లి అమరయ్య (80) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రాములమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

ఇల్లెందురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని కోపంలో కుమారుడు పురుగుల మందు తాగడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ముకుందాపురం గ్రామంలో జరిగింది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు ముకుందాపురం గ్రామానికి చెందిన జన్ని లక్ష్మి కుమారుడు పౌలురాజు(17) గత నెల 28న ఇంటికి అలస్యంగా వస్తున్నవని తల్లి మందలించింది. తల్లి మందలించడంతో పౌలు రాజు కోపంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగిన పౌలురాజును హుటాహుటిన ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా,పరిస్థితి విషమంగా ఉండడంతో వ ఎంహ బు బా బాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 12 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం పౌలురాజు మృతి చెందినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పౌలు రాజు మృతిపై ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.


పౌలురాజు (ఫైల్)

మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూం వద్ద విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ అందరిపై దాడికి పాల్పడుతూ గురువారం హంగామా సృష్టించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ మద్యం మత్తులో సమీపంలో ఉన్న సంఘీక సంక్షేమ హాస్టల్‌లో దూరి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, విద్యార్థులపై ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ దాడికి దిగాడు. అడ్డుకోబోయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అన్వర్‌పై బెల్టుతో దాడిచేశాడు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ రౌడీలా ప్రవర్తించడంపై హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది ఆందోళనచేశారు.

సమాచారం అందుకున్న లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని, ఉన్నతాధికారులకు దృష్టికితీసుకెళ్లి చర్యలు తీసుకునేందుకు కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. విషయమై కానిస్టేబుల్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

ఆదివాసీ మహిళ ప్రసవ వేదన

- ఆసుపత్రికి జెడ్డీలో మోసుకెళ్లిన వైనం
- మార్గంమధ్యలోనే ప్రసవం..
- 108లో ఆసుపత్రికి తరలింపు
- పరీక్షించిన వైద్యులు.. తల్లీబిడ్డ క్షేమం
- భద్రాద్రి జిల్లా ఉమేశ్చంద్రనగర్‌లో ఘటన


గర్భిణిని జెడ్డీలో మోసుకొస్తున్న ఆదివాసీలు

పినపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ ఆదివాసీ మహిళ ప్రసవ వేదనతో ఇబ్బంది పడ్డఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని టీ కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన ఉమేశ్చంద్రనగర్ గ్రామానికి చెందిన మడివి అనిత అనే గర్భిణికి పురిటి నొప్పులు అధికమవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు రహదారి మార్గం లేక జెడ్డీ కట్టి ఆసుపత్రికి తరలించేందుకు పూనుకున్నారు. సదరు గర్భిణికి పురిటి నొప్పులు తీవ్రతరమై ప్రసవ వేదన పడుతుండగా, మార్గం మధ్యలోనే నిలిపి వేసి, స్థానికంగా ఉండే ఓ మంత్రసాని మహిళను పిలిపించి పురుడుపోయించారు. ప్రసవానంతరం తల్లి, శిశువును ప్రధాన రహదారికి జెడ్డీలో తీసుకువచ్చి, 108అంబులెన్స్ సాయంతో జానంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యురాలు శృతి తగిన వైద్యం అందించి, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు నిర్ధారించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన ఎరగదిండ్ల సతీష్‌కి చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.15 లక్షలు నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప గురువారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు ఖమ్మం నగరంలోని చెరువుబజారుకు చెందిన ఫిర్యాది రేగళ్ల కొండలు వద్ద నిందితుడైన సతీస్ తన వ్యాపార అవసరాల నిమిత్తం 18 జనవరి 2017న రూ.15లక్షలు అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తీర్చమని ఒత్తిడిచేయగా నిందితుడు పార్ట్ పేమింట్ కింద 21 జనవరి 2019నాడు రూ. 15 లక్షలకు చెక్కు జారీ చేసినాడు. ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా తగిన నగదు లేకపోవడంతో చెక్కు తిరష్కరణకు గురైంది. తరువాత ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో నిందితునకి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

మోసానికి పాల్పడిన నలుగురు అరెస్ట్

తల్లాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) తల్లాడ సొసైటీ కార్యాలయంలో రూపే కార్డులు అపహరించి రైతుల నగదును విత్‌డ్రా చేసి మోసానికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి గురువారం మధిర కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పి కొండలరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

2018 లో తల్లాడ సొసైటీ కార్యాలయంలో 719 మంది రైతుల రూపే కార్డులను అపహరించి రూ. 40.56 లక్షలు విత్‌డ్రా చేసి మోసానికి పాల్పడిన కేసులో నిందితులైన డి వెంకట కృష్ణారావు, బి చిన్నసైదులు, సొసైటీ ఉద్యోగులు వి వీరారెడ్డి, డి సత్యనారాయణరెడ్డిలను అరెస్ట్ చేశారు.

వంట నూనెలు సలసల

- భారీగా పెరిగిన ధరలు
- నెల రోజుల్లోనే లీటరుపై రూ. 40 నుంచి రూ. 50 వరకు పెరుగుదల
- దిగుమతి సుంకం పెంచడంతోనే ధరలు హైక్
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు



ఖమ్మం మార్కెట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వంటనూనెల ధరలు మంటలు మండి పోతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ వినియోగదారులకు దడ పుట్టిస్తున్నాయి. పండుగలు, శుభకార్యాల వేళ వంట నూనెల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు విలవిల లాడుతున్నారు. గత నెల క్రితం లీటరు పామాయిల్ రూ.90లు నుంచి రూ.95లకు, సన్‌ప్లవర్ ఆయిల్ రూ. 110-115 లకు ఉండగా ప్రసుత్తం పామాయిల్ రిటైల్ మార్కెట్‌లో లీటర్ రూ. 135లకు, సన్‌ప్లవర్ రూ.145 లకు చేరింది. అంతే కాకుండా మన దేశీయ అవసరాలకు పామాయిల్, సన్‌ప్లవర్ నూనెలను ఎక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్న సంగతి విదితమే. ఈ క్రమంలో దేశీయంగా పామాయిల్ ధరలు, సాగు పెంచేందుకు గాను ఇటీవల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఒకేసారి 20 శాతం పెంచింది. దీంతో ఒక్క సారిగా వంట నూనెల ధరలు భగ్గుమన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ నూనె లీటర్ ధర రూ. 150 నుంచి రూ. 160 ల వరకు, రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ రూ.150ల నుంచి రూ.160ల వరకు, మస్టర్డ్ ఆయిల్ (ఆవనూనె) రూ.200 ల నుంచి రూ. 210 ల వరకు, పూజలకు ఉపయోగించే దీపారాదన నువ్వుల నూనె సైతం లీటర్ రూ.150ల వరకు పెరిగాయి. అంతే కాకుండా 15 లీటర్ల సన్‌ప్లవర్ ఆయిల్ టిన్ ధర గత నెలలో రూ. 1,750 లు కాగా ప్రస్తుతం రూ. 2,250 లకు చేరింది. ప్రాంతాలను బట్టి రిటైల్ మార్కెట్‌లో లీటర్‌కు మరో రూ.5 లు అధనంగా భారం పడుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో నూనెలపై ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మన దేశీయ అవసరాలకు ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకోవడంతో ధరల పెరుగుదల నమోదవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మన దేశంలో వంట నూనె గింజల ఉత్పతి కేవలం 5 శాతమేనని, విదేశాలనుంచి దిగుమతి మిగితా 95 శాతం దిగుమతి ఉండటంతో పాటు దిగుమతి సుంకాలు, లోకల్ రవాణా చార్జీలు, జీఎస్టీ, వ్యాపారుల కమీషన్, రిటైలర్ లాభాల మార్జిన్‌లు అధనంగా ఉండటంతో ధరలు పెరుగుదలకు కారణాలని వ్యాపారులు పేర్కొంటున్నారు.

నూనె గింజలు, పామాయిల్ పంటల సాగును సబ్సిడీతో ప్రోత్సహించాలి

నున్నా సత్యనారాయణ, నగర ఆయిల్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు



మన దేశం 95 శాతం వంట నూనెలను విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. కారణం మనదేశంలో రైతులు నూనె గింజలను పండించకుండా పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలను మాత్రమే పండిస్తున్నారు. నూనె గింజలకు మద్దతు ధర ఎక్కువగా నిర్ణయించి, రైతులకు విత్తనాలను, ఎరువులను సబ్సిడీపై అందించి నూనె గింజలు, పామాయిల్ సాగును ప్రోత్సహిస్తే ధరలు ఇక్కడ తగ్గే అవకాశం ఉంటుంది. లేకపోతే నూనెల ధరలను నియంత్రించ లేము. నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నంత కాలం పరిస్థితి ఇలానే ఉంటుంది. ప్రభుత్వాలు ఇకనైనా నూనె గింజల సాగుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలి.

యూనివర్సిటీ తప్పిదంతోనే వ్యక్తిగత ఖాతాలోకి

ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ జాకీరుల్లా

ఖమ్మం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ వారి తప్పిదం కారణంగానే పరీక్షల నిర్వహణకు సంబంధించిన నగదు వ్యక్తిగత ఖాతాలో పడ్డాయని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. 'పరీక్షల బిల్లుల్లోనూ కక్కుర్తి' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వాహణకు సంబంధించిన నగదు వ్యక్తిగత ఖాతాలోకి బదిలీ అయిన విషయం వాస్తవేమననీ, అయితే అది తమ వల్ల జరిగిన తప్పిదం కాదనీ, యూనివర్సిటీ వారికి కళాశాల అకౌంట్ పంపించినప్పటకీ వారు వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేశారన్నారు. దానిపై యూనివర్సిటీకి లేఖ రాసినట్టుగా తెలిపారు. ఏ అధ్యాపకుడి అకౌంట్లో అయితే నగదు పడిందో.. ఆ నగదును సంబంధిత అధ్యాపకుడు బదిలీ అయిన సమయంలో గుర్తించినట్టుగా తెలిపారు. తాను బదిలీ అయిన సందర్భంలో అకౌంట్‌ను మార్చుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా అదనపు నగదు ఉండటాన్ని గమనించి కళాశాల ఖాతాకు డీడీ రూపంలో జమచేశారన్నారు.

త్వరలో అశ్వారావుపేట ఫ్యాక్టరీ 60 టన్నులకు విస్తరణ

- సౌకర్యాల పరిశీలనకు టెక్నికల్ టీం సందర్శన
- ఏడాదిలో పూర్తి చేయనున్నట్టు తెలిపిన ఆయిల్‌ఫెడ్ జీఎం


ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని 60 టన్నుల క్రషింగ్ సామర్థ్యానికి పెంచేందు కు ఆయిల్‌ఫెడ్ సన్నాహాలు చేస్తుందని టీఎస్ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ పి సుధాకరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఏపీ ఇండస్ట్రియల్ అండ్ టెక్నికల్ కో ఆపరేటివ్ ఆర్గనైజేషన్ లిమిటెడ్ సభ్యులు సూర్య ప్రకాష్, నాగిరెడ్డిలతో కలసి అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించారు. జీఎం మాట్లాడుతూ ఈ ఏడాది 3.50లక్షల టన్నుల గెలల దిగుబడి లక్ష్యంగా ఆయిల్‌పామ్ కృషి చేస్తుందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా 30 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో పనిచేస్తున్న అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని 60 టన్నుల సామర్థ్యానికి పెంచేందుకు అవసరమైన సన్నాహాలను ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికే పవర్ ప్రాజెక్టు, బాయిలర్‌లు ఉన్నందున కేవలంలో యంత్రాలను ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని, పనులు ప్రారంభిస్తే ఏడాదిలోనే ఫ్యాక్టరీ విస్తరణ పూర్తి చేయవచ్చునన్నారు. వీటి సాధ్యాసాధ్యాలు, మరమ్మతులు, ఇతర సాంకేతిక విధానాలుపై పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. వీరితో పాటు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి ఆకుల బాలకృష్ణ, అశ్వారావుపేట, దమ్మపేట ఫ్యాక్టరీల మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యాసంస్థలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్‌కు సీఎండీ బలరాం ఆదేశం


సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీ సెక్రటరీ

కొత్తగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి విద్యాసంస్థలను దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలుగా (సెంట్రీస్ ఆఫ్ ఎక్సలెన్సీ) తీర్చిదిద్దాలని ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌కి సంస్థ చైర్మన్ బలరామ్ దిశానిర్దేశ్యం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని విద్యాసంస్థల సెక్రటరీ కలిసి ప్రగతిపై నివేదించి పుష్పగుచ్ఛం అందించారు. సీఎండీ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు పవిత్ర దేవాలయాలు అని, సింగరేణి పాఠశాలలో ఒలంపియాడ్స్ ప్రవేశపెట్టామని, సింగరేణి మహిళ డిగ్రి కళాశాల, పాలిటెక్నిక్‌లలో ఎన్‌పీటీఈఎల్ చాప్టర్ స్థాపనతో పాటు నూతన కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. దేశంలోనే సింగరేణి విద్యాసంస్థలను అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దాలన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవ వేడుకలు

భారత్ స్కౌట్స్, గైడ్స్ ఏర్పడి 75వసంతాలు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిదిగా హాజరైన కే. శ్రీనివాసరావు(జీఎం పర్సనల్ వేల్ఫేర్ అండ్ ఆర్సీ) పతాక అవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడారు. భారత స్కౌట్స్ గౌడ్స్‌లో యువతను భాగస్వామ్యం చేయాలని, ప్రతి ఏడాది యాజమాన్యం ప్రేత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో కే. వరప్రసాద్ వేల్ఫేర్ పీఏ, స్కౌట్స్ మాస్టర్లు, గైడ్స్ క్యాప్టెన్ స్కౌట్స్ లీడర్లు, రెంజర్స్ లీడర్లు, కొత్తగూడెం మహిళా పాఠశాల, మాస్టర్ ఈకే విద్యాలయం, శ్రీశారద విద్యాలయం, శ్రీరామచంద్రా స్కూల్, సిదార్థ ఒకేషనల్ కళాశాలల రోవర్స్ 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సిగంరేణి హెచ్‌ఆర్డీ ఏజీఎం పర్సనల్‌గా విధులు నిర్వహిస్తున్న చందా లక్ష్మీనారాయణను యాజమాన్యం గురువారం సెక్యూరిటీ జీఎంగా ఉద్యోగోన్నతి కల్పించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలి

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు

జూలూరుపాడు/ ఏన్కూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ, మార్కెట్ యార్డులలో విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏన్కూరు, జూలూరుపాడు ఉపమార్కెట్ యార్డును ఆయన సందర్శించి ప్రవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తిని పరిశీలించారు. జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. శాశ్వత మార్కెట్‌ను నిర్మించాలని హమాలీలు, వ్యాపారులు ఆయనకు విన్నవించారు. ఉపమార్కెట్ యార్డులో వసతులు లేకపోవటంతో పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో బూర్గంపాడు, సుజాతనగర్, అశ్వాపురం, కారేపల్లిలలో ఈ ఏడాది 4చోట్ల సీసీఐ కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రభుత్వం ఆదేశాల మేరకు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని సీసీఐ కేంద్రాలను సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పత్తిలో 8 నుంచి 12 శాతంలోపు తేమ ఉన్నట్లయితే ఎన్ని క్వింటాల పత్తినైన సీసీఐ కేంద్రాలలో కొనుగోలు చేయటానికి బయ్యర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో నెలకొన్న పరిస్థితులు, ఇబ్బందులతో పాటు శాశ్వత మార్కెట్ నిర్మాణ సమస్యలను ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ వి.పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి నరేందర్, మార్కెట్ కమిటి కార్యదర్శి బజార్ పాల్గొన్నారు.


జూలూరుపాడులో పత్తిని పరిశీలిస్తున్న వరంగల్ ఆర్జేడీ శ్రీనివాసరావు

ఖమ్మంలో నేటినుంచి ద్వాదశసూరి

- అళ్వార్ల వైభవంపై ప్రవచనాలు
- పలు రాష్ట్రాల నుంచి హాజరుకానున్న వేద పండితులు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయం లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగనుంది. శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ద్వాదశ సూరి గా పిలిచే ఈ కార్యక్రమంలో అళ్వార్ల వైభవంపై వేద పండితులు ప్రవచనాలు బోధించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సాగే ఈ కార్యక్రమంలో 12 మంది ఆళ్వార్ల వేద, భక్తి ఘనతలపై 12 మంది ఉద్దండ పండితులు ప్రవచించనున్నారు. వీరంతా బెంగుళూరు, విజయవాడ, హైదరాబాద్, నరసాపురం, నెల్లూరు, విశాఖపట్నం, తిరుపతి, తదితర ప్రాంతాలనుంచి రానున్నారు. 10 తేదీ రాత్రి 7 గంటలకు సముద్రాల వెంకటరంగనాధాచార్యులు రచించిన ద్వాదశ సూరి వైభవం అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. ఆళ్వార్లు అంటే జ్ఞాన ఖని అని, దైవ భక్తిలో మునిగినవారు అని అర్థం ఉంది.. సంస్కృత వేదాలు వీరి వాక్కుల వెంట గంగా నదిలా ప్రవహిస్తాయి కనుక వీరిని ఆళ్వార్లు అని పిలుస్తారు. వైదిక ఆచార వ్యవహారాలలో సంస్కృత శ్లోకాలే ప్రధానంగా ఉంటున్నాయి. ఇంతటి విశిష్ట ఆధ్యాత్మిక చరిత్రకలిగిన ఒకోఆళ్వారు స్వామి గురించి ఒకో వేద పండితుడు కూలంకషంగా వివరించనున్నారు.

పినపాక పట్టీనగర్‌లో మావోయిస్టు కరపత్రాలు

బూర్గంపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) భద్రాచలం డివిజన్ కమిటీ పేరిట కరపత్రాలు ప్రత్యక్షమయ్యాయి. గ్రామంలోని పలుచోట్ల గురువారం మావోయిస్టు కరపత్రాలు లభ్యమయ్యాయి. ఈ కరపత్రాల్లో గ్రామానికి చెందిన విద్యుత్‌శాఖ ఉద్యోగి తోటమళ్ల సురేష్ రాజకీయ నాయకుల అండదండలతో గిరిజన భూములను అక్రమించి వారిని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. అలాగే గత ప్రభుత్వ హయంలో దళితబంధు పథకం పేరిట అమాయక దళితుల వద్ద డబ్బులు వసూలు చేశాడని, రాజకీయ నాయకుల అండదండలతో వసూలు చేసిన డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ప్రజాకోర్టులో తీవ్రమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. కాగా గ్రామంలో వెలిసిన కరపత్రాలను తొలిగించిన సదరు విద్యుత్ ఉద్యోగి సురేష్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

యథావిధిగా మద్యం సరఫరా

వైరా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం మద్యం సరఫరా యథావిధిగా జరిగింది. సర్వర్ డౌన్ తదితర సాంకేతిక కారణాలతో మంగళ, బుధ వారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వైన్ షాపులకు వైరా ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. మద్యం రేట్లు పెంచేందుకే సరఫరాను ప్రభుత్వం నిలిపి వేసిందనే ఊహాగానాలకు గురువారం యథావిధిగా జరిగిన మద్యం సరఫరాతో తెరపడింది. గురువారం వైన్‌షాపులకు రూ.10.69 కోట్ల మద్యం సరఫరా అయింది.

వైరాలో భద్రాద్రి జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్

- 11 నుంచి 14వ తేదీ వరకు
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి
- జోనల్ అధికారి స్వరూప రాణి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న స్వరూప రాణి

వైరా, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు భద్రాద్రి జోన్ (4వ జోన్) స్థాయి క్రీడలు నిర్వహిస్తామని ఆ సంస్థ భద్రాద్రి జోనల్ అధికారి కొప్పుల స్వరూప రాణి తెలిపారు. ఈ క్రీడల నిర్వాహణ కోసం గురువారం వైరా గురుకులంలో పలు కమిటీలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సమీక్షించారు. ఆ తర్వాత క్రీడల వివరాలను విలేకర్లకు వివరించారు. 10వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్స్ 4వ జోన్‌లోని భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన 14 బాలికల గురుకులాలకు చెందిన 1198 విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో క్రీడాలు జరుగుతాయని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్రీడలను ప్రారంభిస్తారని తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడల విజయవంతానికి 17 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పిజికల్ డైరెక్టర్ కె. శ్రీదేవి, జోనల్ సూపరిడెంటెండ్ సంజీవరెడ్డి, ఖమ్మం డీసీఓ రాజ్యలక్ష్మీ, వైరా ప్రిన్సిపల్ డి. సమత, మీడియా ఇంచార్జ్ ఐనాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో సమగ్ర సర్వే ఎన్యూమరేటర్ల ఆందోళన

- నిబంధనలకు విరుద్ధంగా తమను తొలగించారని ఆగ్రహం
- విధుల్లోకి తీసుకోవాలని కార్యాలయం ఎదుట ఆందోళన
- తహసీల్దార్‌తో వాగ్వాదం


తహసీల్దార్ కార్యాయలంలో ఎన్యూమరేటర్లు

జూలూరుపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వే నిబంధనలకు విరుద్ధంగా ఎన్యూమారేటర్లను తొలగించి ఇష్టానుసారంగా కొత్త వారిని నియమించిన భద్రాద్రి జిల్లా జూలూరుపాడు తహసీల్దార్‌పై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం జూలూరుపాడు తహసీల్దార్ కార్యలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సర్వే నిర్వహించటానికి 73 మంది ఉపాధ్యాయులను ఎన్యూమారేటర్లగా నియమించి శిక్షణ ఇచ్చారని, తామంతా ఒక రోజు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు వేశామని తెలిపారు. అయితే బుధవారం సాయంత్రం 40నుంచి 50 మంది ఎన్యూమారేటర్లను తొలగించి కొత్తగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలను నియమించినట్టు తహసీల్దార్ స్వాతిబిందు సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. ఒక రోజు సర్వే పూర్తయిన తర్వాత తమను తొలగించి కొత్తవారిని ఎలా నియమిస్తారని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఇక్కడ సర్వే నిబంధనలను మార్చటం ఏంటని వారు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని తొలిగించిన వారినే తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నామన్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. సర్వేను సక్రమంగా చేపట్టి ప్రతిరోజు సాయంత్రం వివరాలను అందించాలని, తప్పులు దొర్లితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకు లు ఉపేందర్, ధారావత్ భాస్కర్, హలావత్ నరసింహారావు, వీరస్వామి, హనుమా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు విద్య అవసరం

మణుగూరు టౌన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్‌కు విద్య ఎంతో అవసరమని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. గురువారం మండలంలోని సంతోష్ నగర్‌లో గల శ్రీవిద్యాబ్యాస పాఠశాలకు సింగరేణి మాజీఉద్యోగి చింతల కొమరయ్య రెండు క్వింటాళ్ల బియ్యాన్ని నిత్యవసర వస్తువులను వితరణగా అందించారు. ముఖ్య అతిథిగాహాజరైన జీఎం మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు రమేష్, సర్వర్ నబీ, సేవా సమితి సభ్యులు నాసర్ పాషా, చింతల ఆదిత్య, కార్తిక్, పాఠశాల నిర్వాహకులు జగన్‌మోహన్ రెడ్డి, స్వాతి, కావేరి, సుజాత, రాధ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి మెచ్చా పరామర్శ

అశ్వారావుపేట, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురై మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆరేపల్లి బాబూరావు కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. గురువారం బాబూరావు దశదిన కార్యక్రమాలు జరిగాయి. దీనికి హాజరైన మెచ్చ నాగేశ్వరరావు బాబూరావు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకాశరావు, మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, తాళం సూరిబాబు, నక్కా రాంబాబు, మోహన్ తదితరులు పాపల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి సాయం

దమ్మపేట: పట్వారీగూడెం గ్రామంలో నూతనంగా చేపడుతున్న శివాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆర్థిక సహాయాన్ని అందజేసారు. తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో మెచ్చా నాగేశ్వరరావును ఆలయకమిటి సభ్యులు గురువారం ఆయన నివాసంలో కలిసి ఆలయనిర్మాణానికి సహకరించాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన మెచ్చా శివాలయం నిర్మాణానికి తన వంతుగా రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేయగా కృతజ్ఞతలు తెలిపారు. మెచ్చాను కలిసిన వారిలో ఆలయకమిటి సభ్యులు వెంకటేశ్వరరావు, జానికిరామాచారి, నడ్డి సత్యనారాయణ, జనార్ధనరావు, చక్రధరరావు, జనార్ధనరావులు వున్నారు.

బాధితుడికి సాయం

దుమ్ముగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):పినారాయణరావుపేట అగ్నిప్రమాద బాధితుడు కూరం ప్రసాద్ కుటుంబానికి భద్రాచలం లయన్స్‌క్లబ్ ప్రతినిధి భీమవరపు వెంకటరెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం ఇంటి సామాగ్రి, నిత్యావసర వస్తువులు, కొంత నగదును సాయంగా అందించారు. ప్రమాదం జరిగిన తీరును బాధితుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నాయకులు కల్లూరి ఆదినారాయణ, పిలకా వెంకటరమణారెడ్డి, తోటమళ్ల సుధాకర్, కృష్ణ, సరియం సీతారాం, జాన్సన్, వెంకటేష్, వీరభద్రం, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఈ

భద్రాచలం: భద్రాచలం నీటిపారుదల శాఖ నూతన ఎస్ఈ రవి గురువారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిని శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు డీఈఈ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

బూర్గంపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గల అను శ్రీ ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ మిల్లులో గురువారం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం...జిన్నింగ్ మిల్లు నందు మిషన్‌లో గురువారం ప్రమాదుశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి మిల్లు యాజమాన్యంతో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మణుగూరు రూరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ డీఈ జీవన్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని రామానుజన వరం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడారు. మోటార్ స్టాటర్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కెపాసిటర్ వాడకం వల్ల కలిగే ఉపయోగం, ఆటో స్టాటర్ వాడకం వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై రైతులకు అవగాహణ కల్పించారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన చర్యలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ, సిబ్బంది, స్థానిక రైతులు మామిడి పల్లి సీతారాములు, దాచిపల్లి శ్రీను, లాజరస్, శ్రీనివాసరావు, బత్తిని చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

మణుగూరుటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి విద్యాచందన మండలంలో గురువారం పర్యటించారు. సంతోష్ నగర్‌లోని నర్సరీని పరిశీలించారు. పూర్తి వివరాలను ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. నర్సరీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు అధికారులు తెలిపారు. ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముత్యాలమ్మ నగర్ ప్లానిటేషన్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాఘవ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్ ఏర్పాటుకు పరిశీలన


మణుగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఐరన్ రెయిలింగ్ ఏర్పాటుకు సింగరేణి అధికారులు గురువారం స్పందించారు. విగ్రహం చుట్టూ ఐరన్ రెయిలింగ్ ఏర్పాటుకు అధికారులు పరిశీలన చేశారు.

క్షయ నియంత్రణలో జిల్లా ద్వితీయ స్థానం

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1,819 కేసులు

రెండేళ్లుగా అర్హులకందని ఎన్‌పీవై ఆర్థిక సాయం

ఈ నెల నుంచి ఎన్‌పీవై కింద రూ.వెయ్యి అందజేత



భద్రాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని క్షయ కేసుల్లో 56 శాతం ఐదు దేశాల్లో ఉండగా అందులో 26 శాతం భారత్‌లోనే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ టీబీ రిపోర్టులో పేర్కొంది. అయితే రాష్ట్రంలో క్షయ నియంత్రణలో నిజామాబాద్ జిల్లా ప్రథమస్థానంలో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ద్వితీయ స్థానంలో ఉండటం ఊరటనిస్తోంది. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్షయ నియంత్రణపై వైద్యశాఖ పట్టు సాధిస్తోందని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగానే రాష్ట్రంలో క్షయ నియంత్రణలో జిల్లా ద్వితీయస్థానంలో ఉందని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే మూడు దఫాలు కంచు, రజత పతకాలను జాతీయస్థాయిలో క్షయ నియంత్రణలో జిల్లా సాధించగా, తాజాగా బంగారు పతకం కోసం ప్రతిపాదించబడగా ఇందుకు సంబంధించి కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించాల్సి ఉంది. అలాగే జిల్లాలో క్షయ బాధితుల మరణాలు గత కొన్నేళ్లతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని వైద్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి గత కొన్నేళ్ల క్రితం క్షయ కేసులు జిల్లాలో పెరుగుదల ఉన్నా తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యల ఫలితంగా కేసుల సంఖ్య అదుపులో ఉందని తెలుస్తోంది. క్షయ బాధితుల గుర్తింపును వేగవంతం చేయడం వారికి సకాలంలో మందులు అందజేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వారికి చేరేలా చర్యలు తీసుకోవడంతో క్షయ కేసుల నియంత్రణకు మార్గం సుగమమైందని అధికారులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా అర్హులకందని ఎన్‌పీవై ఆర్థిక సాయం

క్షయ వ్యాధిగ్రస్తులకు పూర్తిస్థాయిలో తగ్గకపోవడానికి ప్రధాన కారణం పోషకాహార లోపమే కారణం. ముఖ్యంగా నిరుపేదలు ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వారికి క్షయ వ్యాధి సంక్రమించిందంటే పోషకాహార లోపం కారణంగా అది త్వరితగతిన తగ్గేందుకు అవకాశం లేదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నిక్షయపోషణ యోజన(ఎన్‌పీవై) పథకాన్ని ప్రవేశపెట్టి వ్యాధిగ్రస్తులకు రూ.500 వారి ఖాతాలకు జమయ్యేలా చర్యలు చేపట్టింది. అయితే కొద్దికాలం ఇది సవ్యంగానే సాగినా సుమారు రెండేళ్లుగా వారి ఖాతాల్లో ఈ మొత్తం జమ కావడం లేదని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కలిపి ఇవ్వాల్సి ఉండటంతోగత ప్రభుత్వం ఈ విధంగా ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో ఆ మొత్తం ఆగినట్లు వినికిడి. అయితే ఇటీవల రూ.రెండు లక్షలు రావడంతో సుమారు 132 మందికి ఆ మొత్తాన్ని జమ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఎన్‌పీవై పథకం కింద క్షయ వ్యాధిగ్రస్తులకిస్తున్న రూ.500 మొత్తాన్ని రూ.వెయ్యికి పెంచుతూ ఇటీవలె కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నవంబరు ఒకటి నుంచి క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి వారి ఖాతాలో రూ.వెయ్యి చొప్పున జమ చేయనున్నట్లు ప్రకటించింది.

పథకాలను సక్రమంగా అమలుచేయండి: కలెక్టర్

కొత్తగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పథకాలను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ విపాటిల్ అన్నారు. గురువారం ఐడీఓసీలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ కేసులపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు భారత రాజ్యాంగం చట్టప్రకారం కల్పించిన హక్కులు, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి 33 శాతం సబ్సీడితో వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో పథకాలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకంతో పాటు వ్యక్తిగత ఆర్థిక అభివృద్ధి కోసం పశువుల పెంపకం, కోళ్ల పెంపకం వంటి పథకాలపై సభ్యులు అవగాహన కల్పించాలన్నారు. పౌర హక్కుల దినోత్సవం రోజునే కాకుండా నిత్యం ప్రభుత్వాలను అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా జిల్లాలో అమలు చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక జిల్లా కోర్టు ఏర్పాటు కోసం సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈ విషయం హైకోర్టు పరిధిలో ఉంటుందని, కాబట్టి జిల్లా జడ్జీకి వినతి పత్రం అందిస్తానన్నారు. జిల్లా ఏర్పాటు సమయంలో చుంచుపల్లిలో సేవాలాల్ జ్ఞాన మందిరం ఏర్పాటుకు స్థలం కేటాయించారని, నేటివరకు కార్యచరణ రూపొందించలేదని సభ్యులు కలెక్టర్‌కు విన్నవించగా చుంచుపల్లి తహశీల్దార్‌ను పరిశీలించాలని ఆదేశించారు.

భద్రాచలం మొబైల్ కోర్టులో జడ్జి లేకపోవడం వల్ల అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, తగు చర్యలు చేపట్టాలని సభ్యులు కలెక్టర్‌కు వివరించగా ప్రభుత్వ పరిధిలో ఉందని త్వరగా జడ్జి నియామకం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఏమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి అనసూయ, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, సీపీఓ సంజీవరావు, కలక్టరేట్ ఏవో రమాదేవి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ జిల్లా కమిటీ సభ్యులు ఎనుమూరి లక్ష్మిబాయి, చింతల రవికుమార్, లౌడియా సామ్య, లకావత్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంచి కమ్యూనిస్టును కోల్పోయాం: కూనంనేని

దుమ్ముగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొర్సా రమేష్ వంటి మంచి కమ్యూనిస్టును కోల్పోయామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్లగూడెంలో రమేష్ సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. రమేష్ ఆది నుంచి నిబద్దత కలిగినటువంటి నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. 2006లో సర్పంచిగా పనిచేసి పార్టీకు మంచి గుర్తింపు తెచ్చారని, చిన్నవయసులోనే గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. రమేష్ కుమార్తె చదువుకు సాయం చేయడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి రమేష్ స్మారక వాలీబాల్ పోటీ విజేతలకు నగదు బహుమతులనందించారు. విజేతలను ఈ సందర్భంగా అభినందించారు. ఎమ్మెల్యే కూనంనేని రమేష్ స్థూపాన్ని ఆవిష్కరించగా, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పార్టీ జెండాను ఎగుర వేశారు. రావులపల్లి రవికుమార్, మీసాల భాస్కరరావు, ఏపూరి వెంక టేశ్వరావు, ఎస్‌వీఎస్ నాయుడు, మహేష్, కిలిమి ఎల్లారెడ్డి, బొల్లోజు వేణు, తాటిపూడి రమేష్, సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, మర్మం చంద్రయ్య, సరియం కోటేశ్వరావు కాంగ్రెస్ నాయకులు కుంజా శ్రీనివాస్, వెంకట రమణారెడ్డి, ఏవీఎస్పీ నాయకులు సోయం కామరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

కరకగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలని, అప్పుడే అనుకున్న స్థాయికి ఎదుగుతారని తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంఈవో గడ్డం మంజూల, జన విజ్ఞాన వేదిక స్టేట్ కల్చర్ సెక్రటరీ డాక్టర్ లింగపల్లి దయానంద్ తెలిపారు. గురువారం మండలంలోని కరకగూడెం, భట్టుపల్లి, అనంతారం జిల్లా పరిషత్ పాఠశాల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8,9,10 తరగతులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పరీక్షలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తీర్ణిత సాధించిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

మునగ సాగుపై దృష్టి పెట్టండి

పినపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ సాగుతో పాటు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని, అందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించడమేగాక, తగు ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోందని డీఆర్‌డీవో ఎం.విద్యాచందన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో మునగసాగుపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు సాంప్రదాయ సాగులో వరి, వాణిజ్య పంటైన మిరపలను మాత్రమే సాగు చేసి, ప్రకృతి విపత్తులతో, మార్కెట్ ధరలతో నష్టపోతున్నారని, వీటి నుండి బయటపడేందుకు రైతులు మునగతో పాటు, పుట్టగొడుగుల పెంపకం, పెరటి కోళ్లపెంపకం, చేపల పెంపకం వంటి ఆదాయాన్నిచ్చే ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టి, ప్రభుత్వం అందించే శిక్షణ, ప్రోత్సాహక రాయితీలతో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పినపాక తహశీల్దార్ ఏ నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం జ్యోతి, ఏపీఓ వీరభద్రస్వామి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల పొలాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల పంట పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం, గిరిజనులకు ఇచ్చిన 73 ఎకరాల పోడు పట్టాల భూమి కొందరు గిరిజనేతరులు ఆక్రమణలో ఉన్నాయనే ఫిర్యాదుల మేరకు ఐటీడీఏ పీఓ ఆదేశాలమేరకు పరిశీలిస్తున్నట్లు ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ తెలిపారు. గురువారం ఆయన అటవీశాఖ, విద్యుత్ శాఖ అధికారులతో కలసి వెంకటాపురం గ్రామానికి చెందిన గిరిజనుల పంట పొలాలను పరిశీలించారు. ఇక్కడ గిరిజనుల పంట పొలాలకు విద్యుత్ సౌకర్యం లేనందున పంటలు పండించడానికి కష్టతరంగా ఉందని, వీటికి విద్యుత్ లైన్లు వేయాలంటే అటవీభూముల్లోనుండి స్తంభాలు వెళ్లాల్సి వస్తుందని, అటవీశాఖాధికారులు సానుకూలంతో దీనిని పరిష్కరించాలని అటవీశాఖాధికారుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. అడవికి, అటవీ జంతువులకు హాని లేని మార్గాన్ని పరిశీలించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు అయ్యేల చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గిరిజనేతరులు సాగు చేస్తున్న పోడు పట్టా భూములను పరిశీలించారు. పోడు పట్టాలను గిరిజనులు గిరిజనేతరులకు ఇచ్చిన, లేక బలవంతంగా గిరిజనేతరులు బెదిరించి ఈ భూములను సాగుచేస్తున్న సంబంధిత పట్టాలు రద్దు చేయబడతాయని పీఓ ఆదేశాలు జారీ చేసారని, గిరిజనులు తమకు ఇచ్చిన పట్టాలలో వారే సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ ఆర్‌వోఎఫ్ లక్ష్మినారాయణ, ఎఫ్ఆర్‌వో మల్లయ్య, విద్యుత్‌శాఖ ఏడీ రవి తదితరులు పాల్గొన్నారు.

'సైన్స్‌ఫేర్ విజయవంతం చేయండి'

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఆర్డీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి మూడురోజులు పాటు అన్నపురెడ్డిపల్లి గురుకుల కళాశాలలో నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. జిల్లా విద్యాశాఖాదికారి వెంకటాచారి, డీఎస్‌వో ఎస్.చలపతిరాజుతో కలిసి కళాశాలలో జరుగుతున్న సైన్స్‌ఫేర్ ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి సైన్స్ ఫేర్‌లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు రాను న్నట్టు తెలిపారు. కార్యక్రమాలకు డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట

వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి, వారి జీవితాల్లో వెలుగును నింపాలనే ఉద్దేశ్యంతో వంద శాతం రాయితీపై ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం జూలూరుపాడులోని ఎంపీడీవో కార్యలయంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని మత్స్యకారుల సొసైటీ సభ్యులకు ఉచితంగా ప్రభుత్వం అందజేసిన చేపపిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో 740 చెరువుల పరిధిలోని సభ్యులకు 8.95 లక్షల చేప పిల్లలను అందిస్తుందని, జూలూరుపాడు మండలంలో 7 చెరువులకు 48,750 చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వం అందించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రభుత్వం మత్స్యకారులకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు రెండో దఫాలో కూడా చేపపిల్లలను ప్రభుత్వం నుంచి తెప్పించి సభ్యులకు అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ఎంతో పాటుపడుతుందని, త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ పథకాలను అందిస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సీతారామ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పనుల పురోగతి, భూ సేకరణ తదితరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ స్వాతిబిందు, కాంగ్రెస్ జిల్లా నాయ కులు లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన పాయం

మణుగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని బావి కూనవరం గ్రామంలో గురువారం నిర్వహించిన ఇంటింటిసర్వే కార్యక్రమాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. సిబ్బంది సేకరించిన వివరాలను పరిశీలించారు. ఇంటికి స్టిక్కర్ వేసే ప్రక్రియను పరిశీలించడమే కాకుండా స్టిక్కర్ వేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాఘవ రెడ్డి, మం డల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ నవీన్, కోటేశ్వరరావు, శివ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో సేవలను అందించాలి

జూలూరుపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలను అందించి వారి మన్నలను చూరగొనాలని డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. గురువారం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను అందిచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నిషియన్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జూలూరుపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చలికాలం సమీపించటంతో జిల్లాలోని 14 కేజీవీబీ పరిధిలోని బాలికల ఆరోగ్యం పట్ల ఎస్‌ఓలు ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి(జీసీడీవో) జె.అన్నామణి కోరారు. గురువారం జూలూరుపాడులోని కేజీవీబీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, విద్యార్థులకు అందిస్తున్న భోజన పదార్థాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'పేట'లో కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి

అశ్వారావుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గెలల కలక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టీఎస్ ఆయిల్‌ఫెడ్ రైతు అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషకు వినతిపత్రం అందజేసారు. గురువారం హైదరాబాదులో నియోజకవర్గానికి చెందిన అడ్వయిజరీ కమిటీ సభ్యులు రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, కేవీ సత్యనారాయణ, నున్న రత్నాకర్‌లు ఆయిల్‌ఫెడ్ ఎండీని కలసి ప్రస్తుతం గెలల దిగుబడి తక్కువ ఉండటంతో అశ్వారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిపివేసి, గెలలను అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని, ఇది చిన్న సన్నకారు రైతులకు భారంగా మారిందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

రూ.6.90కోట్లతో బ్రిడ్జీల నిర్మాణం

ములకలపల్లి , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురం, అన్నారం, గుర్రాలకుంట గ్రామాలను అనుసంధానం చేస్తూ మూడు బ్రిడ్జీలను రూ.6.90కోట్లతో నిర్మాణాలను చేపుడుతున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ములకలపల్లి మండలంలోని నిర్మాణంలో వున్న తాళ్ళపాయి, ముత్యాలంపాడు గ్రామంలో నిర్మాణంలో వున్న బ్రిడ్జీలను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాలు తగ్గటంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బ్రిడ్జీ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

'రిజర్వేషన్ అమలుచేయాలి'

మణుగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో ఉన్న ఎస్సీ కులాల రిజర్వేషన్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ హెద్యూల్ కులాల హక్కుల పోరాట సమితి మండల కమిటీ మణుగూరు పట్టణంలో గురువారం ఆందోళన చేపట్టింది. అంబేద్కర్ సెంటర్‌లో గల అంబేద్కర్, కొమరం భీం విగ్రహాలకు నాయకులు బి.శ్రీనివాస్ పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్‌ను 20 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. కానీ పాలకులు రిజర్వేషన్‌ను తొలగించడం దారుణమన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి, హక్కులను కల్పించాలని కోరారు. గత సీఎం కేసీఆర్ రెవెన్యూ చట్టంతో ఎస్సీలు రుణాలు పొందే అవకాశాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎస్సీలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆంక్షలు లేకుండా ఎస్సీ రైతులకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు కృపాకర్, సడలమ్మ, పార్వతి, రాములు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణ, నరసింహారావు, కుమార స్వామి, రావుల పల్లి రామ్మూర్తి, తెల్ల భిక్షపతి, లింగంపల్లి రమేష్, మద్దెల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నిబంధనలు పాటిస్తేనే రైతులకు బోనస్

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నిర్వహించబడుతున్న చుంచుపల్లి మండలంలోని పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తుందని, బోనస్ పొందాలంటే తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలియజేశారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం భద్రాద్రి జిల్లా సహకార శాఖ అధికారి సయ్యద్ ఖర్షీద్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జిల్లాలోని రైతులకు అందుబాటులో సహకార సంఘాల ద్వార ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని తెలియజేశారు. తప్పకుండా నిబంధనల ప్రకారం ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తేనే ప్రభుత్వ మద్దతు ధర వర్తిస్తుందని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర ఎ గ్రేడ్‌కు రూ.2320, అలాగే సి గ్రేడ్ ధాన్యంనకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2300లుగా ఉంటుందన్నారు. ఇది కాక సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 క్వింటాకు బోనస్ ఇస్తుందని, రైతులు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా దగ్గరలోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ధాన్యం తేమ శాతం 17 శాతంలో ఉండే లాగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్‌రావు, డీఎంవో త్రినాద్‌బాబు, ఏడీఏ నర్సింహారావు, చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ, డీటీ ఉమామహేశ్వరరావు, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, చుంచుపల్లి ఏవో రాజేశ్వరీ, డీసీసీ బ్యాంకు కొత్తగూడెం మేనేజర్ ఇ.శాంతిరాగమయి, సంఘ సెక్రటరీ పండ్ల సారయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కూనంనేని